సంపాదకీయం:

# కవిత్వ ఉద్యమతత్వాల కలనేత : కాళోజీ

'చచ్చిపోయిన వాడి కళ్లు చారెడు' అని మనకొక సామెత వుంది. నిజంగా చారెడు కళ్లవాడే చనిపోతే అది కాళోజీ మరణంలా వుంటుంది.

ఒక పాత సంస్కృత శ్లోకం ప్రకారం సరస్వతీదేవి (జ్ఞానదేవత) రెండు పాలిండ్లూ వొకటి సంగీతమూ, మరొకటి సాహిత్యమూ అయితే కాళోజీ రెండు కండ్లూ వొకటి సాహిత్యమూ మరొకటి ఉద్యమమూ.

"అతిథివోలె వుండి వుండి అవని విడిచి వెళ్లుతాను" అని ఆయన రాసుకున్నా, తన చారెడు కళ్లు మరొకరి ముఖానికి అమరి ప్రశ్నల కొడవళ్లను, ఉద్యమ ఉరవళ్లను ప్రసరిస్తూనే వుంటాయి. ఆయన నిర్జీవ శరీరం కూడా శాస్త్ర విజ్ఞాన వికాసానికి వినియోగింపబడుతూనే వుంది. ఆయన స్మృతులూ, స్ఫూర్తి సామాజికమై వర్తమానం నుండి భవిష్యత్తులోకి మరింత సౌందర్యవంతంగా సాగటానికి ఉత్తేజాన్నిస్తోంది. ఆవిధంగా ఆయన చిరంజీవి!

తనకూ సమాజానికి సమన్వయం కుదిరేదాకా సంఘర్షణ పడటం కవి లక్షణం. కాళోజీ వ్యక్తిత్వం అంటే కవిత్వ, ఉద్యమతత్వాల కలనేత. తాను 16 ఏట చెప్పిన విషయాలే 89వ ఏట కూడా చెప్పవలసి వస్తోందన్నాడు. ఈ 73 సంవత్సరాలలో సమాజంలో మౌలికమైన మార్పులు రాలేదన్నమాట. "అన్యాయం అంతరిస్తే నా గొడవకు విముక్తి" అన్నాడు. విముక్తి సాధించే గొడవను మనకు శాశ్వతంగా వదిలేశాడు.

మిగతా అన్ని సాహితీ ప్రక్రియల్లో కంటె కవిత్వానికి ఉష్ణోగ్రత ఎక్కువ. జ్వలిస్తూ వుండటం కవిత్వపు జీవ లక్షణాల్లో వొకటి. కనుక కవి నిత్యం జ్వలిస్తూనే వుండాలి. జ్వలిస్తూ చలింపజేస్తూ ఉండాలి. కవిత్వం ఆగిపోయినా, జ్వలనం ఆరిపోయినా లోకం అటువంటి వారిని పట్టించుకోదు.

బ్రిటిషువాళ్లు తెరవెనుకకు తప్పకోగానే బ్రహ్మానందపడి పోయినవాళ్లు, నిజాం నవాబు తెల్లజెండా ఎత్తగానే చల్లబడిపోయిన వాళ్లూ వున్నారు. కానీ కాళోజీ గొడవ అంతటితో ఆగేదికాదు. ఆయన ఆవేదన తీరేదికాదు. "అవనిపై జరిగేటి అవకతవకలపై" ఆక్రోశంతో చివరికంటా ప్రశ్నిస్తాడు. "పరుల కష్టము చూచి గుండె కరగటం, మాయ మోసము చూచి ఒళ్లు మండిపోవటం" ఆయన జీవలక్షణం. తన కలంతోనో, గళంతోనో చివరి క్షణాల దాకా సామాజిక అసమానతలపైనా, ఎగుడు దిగుడుల వివక్షతలపైనా నిప్పులు కురిపిస్తూనే వున్నాడు. ఆయన ఆవేశ ప్రకటనలూ, అభిప్రాయాలూ అందరి ఆమోదాన్నీ పొందలేకపోవచ్చుగానీ ఆయన నిష్కర్షగా నిస్వార్థంగా అభిప్రాయాల్ని వ్యక్తం చేసే తత్వం ఎవరూ కాదనలేనిది.

పుట్టుకతోనే మానవులకు సంక్రమించే పౌరహక్కుల్ని అణచివేసిన పాలకులందర్నీ ఆయన ఎదిరించాడు. ధిక్కరించాడు. నిజాం పాలనలో పట్టణ బహిష్కారం, జైలు

శిక్షలు ఆయన సంకల్పాన్ని సడలించలేకపోయాయి. ఎమర్జెన్సీ అకృత్యాలకు బాధ్యుడైన జలగం వెంగళ్రావునీ, కల్లోలిత ప్రాంతాలను ప్రకటించిన చెన్నారెడ్డినీ హక్కుల అణచివేతలో మామను మించిన అల్లుడి (ఎన్టీఆర్, చంద్రబాబు) ప్రభుత్వాలనీ - నిర్భయంగా నిలదీసి కడిగి ఆరేయటానికి, ఆయనికి జంకూ, గొంకూ వుండేది కాదు. ఎమర్జెన్సీ చీకటిరోజులలో నిరసన తెల్పటానికి వస్తామన్న వారెవరూ రాకపోయినా కాళోజీ వొక్కరే నోటికి గుడ్డ కట్టుకుని వరంగల్లు బజారుల్లో నిరసన ప్రదర్శన చేశారు.

గ్రంథాలయ ఉద్యమంలో, ఆర్య సమాజపు కార్యకలాపాల్లో ఆంధ్ర మహాసభ వీరోచిత పోరాటంలో కాళోజీ పాల్గొన్నారు. తెలంగాణా రచయితల సంఘంలోనూ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యునిగాను తనదైన ముక్కుసూటిదనంతోనే పనిచేశారు. తెలంగాణా జిల్లాలలో ప్రత్యేకించి వరంగల్లులో రచయితలకు ఆయనొక స్ఫూర్తి! కొత్తతరం రచయితలను ప్రోత్సహించి నడిపించటం ద్వారా వారికొక 'పెద్దదిక్కు'గా వుండేవారు. తానేవొక 'మిత్రమండలై' మసలేవారు.

బిరుదుల కోసం భజనలు చేయటం, పదవుల కోసం పల్లకి మోయటం ఆయనకు చేతకాని విద్య. తనకు లభించిన గౌరవాలకు పొంగలేదు. అవి లేవే అని వ్యధ చెందలేదు. తనకు లభించిన గౌరవాల్ని పురస్కారాల్ని ప్రజాసేవకే వినియోగించటం ఆయన ప్రత్యేకత.

కాళోజీ కొద్దికాలం కాంగ్రెస్‌పార్టీలో వుండినా (1952 ఎన్నికలలో కాంగ్రెసు అభ్యర్థిగా వరంగల్లు పార్లమెంటరీ నియోజక వర్గానికి పోటీ చేసి కమ్యూనిస్టు అభ్యర్థిపై ఓడిపోయాడు) ఆయనిది రాజకీయ పార్టీలు, సంస్థలు నిర్మాణాల్లో యిమడలేని స్వభావం. అలాగని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కూడనివని ఆయన భావించలేదు. ఆయన వినిర్మాణవాది కాడు. వినిర్మాణ జీవి. ఆయన నుండి నేర్చుకోవలసినది సంస్థలకు వెలుపల వుండటం కాదు. నిరంతరం ప్రజల పట్ల గుండె చెమ్మగిల్లే స్పందన కలిగి వుండటం! రాజ్యం విసిరే ఉరులకూ, ఎరలకూ, లొంగకుండా ప్రజల పక్షాన అప్రకటిత ప్రతినిధులుగా నిర్భయంగా నిలబడటం!!

ప్రజలపైన ఎవరు దౌర్జన్యం చేసినా కాళోజీ సహించలేకపోయాడు. "ఎన్నికలలో ఓటు వేసిన వారి చేతులు నరుకుతామని" పీపుల్స్‌వారు నక్సలైట్లు ప్రకటిస్తే ఓటు వేయటమూ, వేయకుండుట స్వచ్ఛంద హక్కేగాని ఎవరి దౌర్జన్య హెచ్చరికలనూ లక్ష్యపెట్టవద్దంటూ - తానే ముందు వెళ్లి ఓటు వేసివచ్చాడు.

భాష- ప్రాంతము - కులము- మతము- లింగము ఇవన్నీ పీడిత ప్రజల మధ్యన వుండే అనేక రకాలయిన వైవిధ్యాలు, వైరుధ్యాలు - వీటిని గుర్తిస్తూనే దోపిడీ పెత్తందారీ పీడక శక్తులకు వ్యతిరేకంగా సమస్త పీడిత ప్రజానీకాన్ని ఐక్యం గావించటం ప్రజా ఉద్యమానికి సున్నితమైన అత్యంత కీలక కర్తవ్యం.

మతాన్ని వ్యతిరేకించే హేతువాదులు మతస్తుల్ని ద్వేషించకూడదు. లౌకికవాదులు మతవాదాన్ని వ్యతిరేకించాలిగానీ మతాన్ని, మతస్తుల్నికాదు. తెలంగాణా విమోచన నోద్యమ కాలంలో నిజాం వ్యతిరేకత అంటే ఫ్యూడల్ పెత్తందారీరాజ్య వ్యతిరేకతేగాని ముస్లిం వ్యతిరేకతకాదు. ఫాసిస్టు స్వభావం కలిగిన రజాకార్లను ద్వేషించటమూ

మొత్తంగా ముస్లిములను ద్వేషించటమూ ఒకటికాదు. ఉర్దూ భాషా పెత్తనాన్ని వ్యతిరేకించటమంటే ఉర్దూని వ్యతిరేకించటం కాదు. దాని ద్వారా రుద్దబడుతున్న అప్రజాస్వామిక నిరంకుశ పెత్తనాన్ని వ్యతిరేకించటం. ఇవి తెలంగాణా విమోచనోద్యమం నెలకొల్పిన లౌకిక ప్రజాస్వామ్య సాంస్కృతిక విలువలు. కాళోజీ ఆత్మకథలో వర్ణించిన మత సంబంధిత సంఘటనలు ఈ విలువల పరిధిలోనే వుంటాయి. ప్రజల మధ్య వైరుధ్యాల రూపంలో వ్యక్తమయే ఆధిపత్య భావజాలాలపైన కూడా చాలా పోరాటం చేయాల్సి వుంటుంది. సాంస్కృతిక ఆభిజాత్యాలూ, అహంభావాలూ కూడా దీనికి మినహాయింపుకాదు. ఈ పోరాటమంతా ప్రజల మధ్య మరింత బలీయమైన ఐక్యతను నెలకొల్పటానికై వుండాలి.

ప్రజల మధ్య వైరుధ్యాల సంక్లిష్టతల్నీ, సున్నితత్వాల్నీ అవగాహన చేసుకోకపోతే, ఆ వైరుధ్యాల ఫలితంగా ఉత్పన్నమయే సంఘర్షణే తక్షణమైనదిగా, కీలకమయినదిగా ముందుకు వచ్చి అవసరానికి మించిన ప్రాధాన్యతను పొంది ప్రజాశత్రువులపై సాగాల్సిన మౌలిక సంఘర్షణను వెనక్కి నెట్టటమో, పక్కదారి పట్టించటమో జరిగే ప్రమాదం వుంటుంది. వీటి పట్ల ప్రజాస్వామిక, లౌకికవాదులు కూడా అప్రమత్తంగా ఉండటం చాలా అవసరం.

ప్రజల మధ్య వైరుధ్యాలను ప్రజాస్వామిక శక్తులు సక్రమంగా పరిష్కరించకపోతే పాలకవర్గాలు, హిందూ ముస్లిం ద్వేషాలను పెంచాలని చూసినట్టు కులము, ప్రాంతము, లింగము పేరిట కూడా ప్రజల మధ్య శత్రుపూరిత ద్వేషాల్ని వ్యాప్తి చేయటానికి ప్రయత్నిస్తారు. వీటిని ఎడాపెడా కాకుండా సున్నితంగా, ఓర్పుగా, నిరంతరాయంగా దృష్టి నిలిపి పరిష్కారమయేట్టు సాహిత్యకారులు కూడా తమ కార్యరంగాల ద్వారా కృషి చేయాలి.

కాళోజీ తల్లి కన్నడిగ. తండ్రి మరాఠా. ఉర్దూ నిజాం రాజ్యభాష. ఇంగ్లీషు బ్రిటిషు వలసపాలకుల భాష కాళోజీ చుట్టూ జీవించే ప్రజలది తెలుగు. ఐదు భాషలలో ఆయనకు ప్రవేశం వున్నా ఆయన తెలుగులోనే రాశారు. ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాస తెలుగు. ఆయన రాత సజీవ తెలుగుభాష ఆయన కూత ఓరుగంటి ప్రజల యాస. ప్రజల ఆనందాలూ ఆవేదనలూ ఆయన అక్షర బాష్పాలు. ఆయన చారెడు కళ్లూ మనల్ని ప్రశ్నిస్తూంటాయి. నిలవేస్తాయి. ప్రజల కోసమే జీవించండిరా అని ఆదేశిస్తుంటాయి.

సామాజిక దోపిడీ, పీడనా, అణచివేతా, అసమానతలకు వ్యతిరేకంగా తన కలం, గళం ద్వారా ఉద్యమించిన నిజమైన ప్రజాస్వామిక జీవి ప్రజాకవి కాళోజీ! ఆయన కవిత్వాన్నీ, వ్యక్తిత్వాన్నీ స్ఫూర్తిగా స్వీకరించి ఆయన ఆశలనూ, ఆశయాలను నెరవేర్చే దారిలో దృఢంగా నిలవటమే, నడవటమే ఆయనకు అర్పించగలిగే నిజమైన నివాళి.

జనసాహితి సంస్థా, ప్రజాసాహితి పత్రికా ప్రజాకవి కాళోజీ మరణానికి తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ బాష్పాంజలి ఘటిస్తున్నాయి.

**23-11-02.**

# కాళోజీతో....




- నిర్మలానంద

అవి నేను హిందీలో విస్తృతంగా అనువాదాలు చేస్తున్న రోజులు (1960-75).

డా॥ భీమ్‌సేన్ నిర్మల్ (భండారం భీమ్‌సేన జోస్యులు)తో నాకు పరిచయం ఏర్పడింది. ఆయన హిందీలో రచయిత. తెలుగునించి కొత్తగా హిందీలోకి అనువాదాలు చేసే యువకుల్ని ప్రోత్సహించేవారు. వరంగల్‌లో హిందీ లెక్చరర్. నేను హైదరాబాద్ వెళ్లినపుడల్లా వరంగల్‌లో దిగి ఒకటి, రెండు రోజులు భీంసేన్‌గారితో గడిపేవాణ్ని. ఆయన ఒకసారి నన్ను నక్కలగుట్ట తీసుకెళ్లి, కాళోజీ నారాయణరావుగారితోనూ, వారి సోదరులు, ఉర్దూ కవి రామేశ్వరరావు 'షాద్'గారితోనూ పరిచయం చేశారు.

కాళోజీ సోదరులు నా ప్రయత్నాన్ని మెచ్చుకున్నారు. కాళోజీ తన 'నా గొడవ' రెండు సంకలనాలు నాకిచ్చారు.

ఇదీ కాళోజీతో నా తొలి పరిచయం.



కాళోజీ కవిత ఒకటి హిందీలోకి తర్జుమా చేశాను. అది అచ్చయింది. దాని ఆధారంగా నా సింధీ కవి మిత్రుడు చేసిన అనువాదం సింధీ పత్రికలో అచ్చయింది. ఆ రెండూ కాళోజీకి పంపించాను.

❖ ❖ ❖

అది తెలంగాణా ఉద్యమం చెలరేగిన రెండో రోజు. అలవాటు ప్రకారం నేను వరంగల్ వెళ్ళాను. భీంసేన్ కాలేజీకి వెళ్లిపోయాక, నేను నక్కలగుట్ట వెళ్ళాను. కాళన్నయ్యని కలిశాను.

'చూడరా తమ్ముడూ! కృష్ణాజిల్లానించి వచ్చిన భూస్వాములు మా రైతులనించి కారుచవకగా భూములు కొనేసి, అమ్మినవారినే ఆ భూముల్లో పాలేర్లుగా పెట్టుకొని, అయిన దానికీ కానిదానికీ వార్ని నానాబూతులు తిడ్తారురా! ఇదేమయినా బావుందా?'' అన్నారు కాళోజీ. అలా చెబుతున్నపుడు ఆయన మొహంలో ఆక్రోశం, కళ్లలో గిర్రున తిరుగుతున్న కన్నీళ్లూ చూశాను.

పాతికేళ్ల కుర్రవాణ్ని. ఏం జవాబు చెప్పాలో తేలీక మౌనం వహించాను.

ఉద్యమం క్రమంగా సద్దు మణిగింది.

❖ ❖ ❖

1970 సంవత్సరం విశాఖలో పెద్ద ఎత్తున మహాకవి శ్రీశ్రీ షష్టిపూర్తి సభలు జరుగుతున్నాయనీ ఆహ్వానసంఘంలో నా పేరూ వేశామని రావిశాస్త్రిగారి నించి లేఖ.

మా 'తెలుగు సాహిత్య ప్రచార సమితి' తరపున ఓ సంకలనం హిందీలో ప్రచురించి, శ్రీశ్రీకి సమర్పించాలని నిర్ణయించాం. డా॥ భీమ్‌సేన్ నిర్మల్ 2 కవితలు, నేను 3 కవితలు అనువాదం చేసేట్టు మూలకవితలు కూడా హిందీ లిపిలో ఒకవేపున, అనువాదం రెండోవేపున వేసేటట్టు అనుకున్నాం. 'ముందుమాట' డా॥ నిర్మల్ రాశారు. మేటరు ఝూర్సీ గూడా! (నేను రైల్వే ఉద్యోగంచేస్తూండిన చోటు)లో, ముఖచిత్రం శీలా వీర్రాజువేసి దానిని హైదరాబాద్‌లో అచ్చువేయించేటట్టు అనుకున్నాం. షష్టిపూర్తి రోజుకి హిందీ అనువాదం సంపుటి "ఆగ్ ఉగల్‌తా హువా"...ని విశాఖ తీసుకెళ్లాను. విషయం రావిశాస్త్రితో చెప్పి, కార్యక్రమంలో హిందీ అనువాద పుస్తకాన్ని శ్రీశ్రీకి సమర్పించే అంశాన్ని చేర్పించాను.

అన్నీ బాగానే వున్నాయి. పుస్తకాన్ని ఎవరు పరిచయం చేయాలి? సమస్య ఎదురయింది. విశాఖ సభకి కాళన్నయ్య హాజరవడం చూసి మనసు తేలిక పడింది. కాళన్నయ్యని ఒప్పించాను. ఆయన 'సరే'నన్నారు.

"వాడు (శ్రీశ్రీ) ఎన్ని సీసాలు ఖాళీచేసేడన్నది కాదు తెలుగుసాహిత్యాన్ని ఏ మార్గం పట్టించాడన్నది ముఖ్యం" అని మొదలెట్టి, "ఆగ్ ఉగల్‌తా హువా" పుస్తకాన్ని వివరంగా పరిచయంచేసి ఆవిష్కరించారు కాళన్నయ్య. తర్వాత ఆ పుస్తకాన్ని శ్రీశ్రీకి నేను సమర్పించాను.

❖ ❖ ❖

డా॥ భీమ్‌సేన్ నిర్మల్ ప్రమోషను మీద హైదరాబాదు వెళ్ళారు. తర్వాత యువకవి వే.నరసింహారెడ్డితో నాకు పరిచయం అయింది. అది స్నేహంగా మారింది. వేనరెడ్డి యిల్లునా వరంగల్ మకాం అయింది.

ఒకరోజున వేనరెడ్డి నన్ను వరంగల్ రచయితల, కవుల యిళ్లకి తీసుకెళ్ళారు. ఉదయం 8 గం.లనించీ రాత్రి 12 గం.ల దాకా తిరిగాము. మొదట కాళోజీ సోదరుల్ని కలిశాం. చివర్న సి.వి.కృష్ణరావుని కలిశాం. మధ్యాహ్నం భోజనంచేసి విశ్రాంతి తీసుకుంటూండగా 18 ఏళ్ల యువకవి టంకశాల అశోక్ వచ్చి వెళ్ళాడు వేనరెడ్డి యింటికి. అందరూ తమతమ కవితల్ని చదివి వినిపించారు. విషయం నాకు బోధపడలేదు. నేను కొత్తవాణ్ణి అయినా అందరూ తమ తమ రచనలు చదివి వినిపిస్తున్నారు.

"వేనరెడ్డిగారూ? నేను వారికి కొత్తవాణ్ణయినా అందరూ తమతమ రచనలు నాకు వినిపిస్తున్నారు. ఏమిటి విశేషం?" అని అడిగాను.

చిరునవ్వులు చిందిస్తూ ఆయన యిచ్చిన సమాధానం.

"ఇది వరంగల్ సాహిత్యవేత్తలకు కాళోజీ సోదరులు దిద్దిన ఒరవడి! బయటినించి ఏ సాహిత్యవేత్త వరంగల్‌వచ్చినా తమ యిళ్లకి వస్తే, ఆ రచయితలు విధిగా తమ తాజా రచనని చదివి వినిపించాలి. తాజా రచన చెయ్యకపోతే పాత రచన అయినా ఫర్వాలేదు!"

వరంగల్‌లో కాళోజీ సోదరులు పెట్టిన ఈ విలక్షణమయిన ఒరవడికి నేను పులకించి పోయాను.

❖ ❖ ❖

ప్రజల గొడవ తన (నా) గొడవగా చేసుకొని కలం వ్యవసాయం చేసిన ప్రజాకవి కాళోజీ మృతి (13.11.2002) తెలుగు సాహిత్యానికేకాదు, పౌరహక్కుల ఉద్యమానికీ పూరించలేనిలోటు.

❖